# బంగారి

-తమిరిశ జానకి

"ఏంటే నీ గోల? చెప్తే యినవు..."

"ఉహూ... నాక్కావాల. ఆ పట్టు లంగా మాదిరిదే నాకూ కావాల"

పది నిమిషాలుగా ఆ తల్లీ కూతుళ్ళ సంభాషణ వంటింట్లో పనిచేసుకుంటున్న వర్ధని చెవుల్లో పడుతూనే ఉంది.

వంటింటి బయట గిన్నెలు తోముతోంది గౌరమ్మ. పక్కనే కూచుని వాళ్ళమ్మతో మాటల యుద్ధం చేస్తూ విసిగిస్తోంది బంగారి.

దీపావళి పండక్కి తన కూతురికి కంచిపట్టు పరికిణీ, జాకెట్టు కుట్టించింది వర్ధని. కొంచెం సేపటి కిందట పక్కింటి సుజాత వొచ్చినప్పుడు అవి చూపించింది. సరిగ్గా అదే సమయంలో.. నాలిగింటికి.. గిన్నెలు తోమడానికొచ్చింది గౌరమ్మ. కూడా వొచ్చిన బంగారి డ్రాయింగ్ రూమ్‌లోనే నిలబడిపోయి ఇంతింత కళ్ళేసుకుని పట్టు పరికిణీని పదే పదే పరీక్షగా చూసింది. ఇంక అంతే.. అప్పట్నించీ వాళ్ళమ్మ పక్కన చేరి తనకీ అలాంటిదే కుట్టించమని ఆగకుండా సణుగుతోంది. దానికేం తెల్సు దాని ఖరీదు.

పండక్కని ఓ పాలియెస్టరు చీర కొని గౌరమ్మకిచ్చింది వర్ధని... దీపాల పండక్కయినా ఓ కొత్త చీర కొనియ్యవా అని అది గొడవ చేస్తుంటే.

తన కూతురికి పొట్టి అయిపోయిన సిల్కు గౌనోటి బంగారి కోసం ఇచ్చింది. దాని కళ్ళు పట్టు పరికిణీ మీద పడ్డాయి...

నవ్వొచ్చింది వర్ధనికి... "పిచ్చి మొహం కాకపోతే వాళ్ళమ్మ కొనగలదా? అంత డబ్బుపోసి అదెందుకు కొంటుంది? ఈ పిల్లకి వాళ్ళమ్మ మీద ప్రేమేడ్సింది గనకనా... ఎప్పుడూ ఏదో ఒకటి కొనిపెట్టమని సతాయిస్తుండడం తప్ప... దీని మూలంగా వాళ్ళమ్మకి తల నెప్పి తప్ప లాభం ఏవీ లేదు...

○ ○ ○

పండగ రేపనగా ముందురోజు బంగారి ఒక్కత్తే వొచ్చింది పనికి.

"మీ అమ్మేదే?"

"అమ్మకి జొరం"

"అయ్యో రామా! తీరా పండగనాడు పన్లోకి రాదన్న మాట.. అయ్యిందన్నమాటే నా పని"

"నేనొస్తాకదమ్మా"

"నువ్వెక్కువ చెయ్యలేవుగా! గిన్నెలెక్కువ తోమలేవు. బట్టలసలుతకలేవు... నగం పని నేను చేసుకోవల్సిందే..."

ఏం చెప్పాలో తెలియలేదు బంగారికి.

"మందు తెచ్చుకుందా జ్వరానికి?"

"లేదమ్మా"

"ఏం?"

"ఉన్న పది రూపాయలూ మా నాయన తీసుకుపోయిండు"

"ఎందుకూ?"

తలొంచుకుంది బంగారి తనేదో తప్పు చేసినట్టు.

"మాటాడవేమే?"

"సారా తాగడానికమ్మా"

"మీ అమ్మ జ్వరంతో లేవలేకపోయినా సారా తాగడానికెళ్ళిపోతాడా?"

"ఔనమ్మా" ఏడుపొచ్చింది బంగారికి. మరి మాట్లాడలేకపోయింది. ఒళ్ళు మండుకొచ్చింది వర్ధనికి... వీళ్ళూ వీళ్ళ దొంగేడుపులూనూ... పట్టు పరికిణీ కుట్టించమని ఆ రోజు ఇది మటుకు వాళ్ళమ్మని ఏడిపించుకు తిన్లేదూ?... అందరూ అందరే... మొన్నామధ్య ఓ రోజు దీనికి కడుపులో నెప్పంటే మందు తెచ్చుకోడానికి పది రూపాయలిమ్మంది గౌరమ్మ... జీతంలో విరగ్గోసుకోమంది... అతి తెలివిగా ఇప్పుడదే ఎత్తు వేసినట్టుందిది... ఏడిస్తే మందులు తెచ్చుకుందుకు డబ్బిస్తాననుకుంటోందేమో! ఉన్న పది రూపాయలూ సారా కోసం తగలేసుకోడానికెళ్ళిన వాళ్ళ నాన్నకి పట్టనప్పుడు వేరే ఎవరికి మాత్రం ఎందుకు పడుతుంది?

గిన్నెలు తోమి ఇల్లూడ్చి గుమ్మంలో నిలబడింది బంగారి.

ఓరగా దాన్ని చూసి తల తిప్పుకుంది వర్ధని... అసలు నిజంగా వీళ్ళమ్మకి జ్వరం వొచ్చిందో లేదో ఎవరికి తెల్సు? పండక్కి కాస్త పనెక్కువుంటుందని

ఎగనామం పెట్టడానికి ఎన్నో వేషాలేస్తుంటారు. అబ్బెబ్బే... నమ్మడానికి లేదు.

"ఇంకా నిలబడ్డావేం? పనిచేసేశావుగా ఇంక వెళ్ళు..."

వెనక్కి వెనక్కి చూసుకుంటూ బిక్కమొహం వేసుకుని వెళ్ళిపోయింది బంగారి.

పూజ గదిలో భగవధ్యాస లేకుండా బంగారి స్తోత్రాలు వాళ్ళమ్మ సహస్ర నామాలు సరిపోయాయి వర్ధనికి.

❍ ❍ ❍

మర్నాడు పొద్దున్నే... గౌరమ్మ వొస్తుందేమోనన్న చిగురంత ఆశతో వంటింట్లోంచి వీధి గుమ్మంలోకి, వీధి గుమ్మంలోంచి వంటింట్లోకి కాలు కాలిన పిల్లిలా తిరుగుతుంటే అడిగాడు సుపుత్రుడు రమేష్.

"ఏంటమ్మా... ఏ ప్రైమ్ మినిస్టరో, ప్రెసిడెంటు కోసమో చూస్తున్నట్టు కాళ్ళరిగేలా తిరుగుతున్నావు?"

"నాయనా వాళ్ళ కోసం నేనెందుకు చూస్తాను? వాళ్ళేమన్నా నాకు ఇంట్లో పన్లు చేసి పెడతారా?"

"అంతేలే.. అది సరేగానీ అమ్మా... నేనిప్పుడు కాసేపట్లో బయటికెళ్తాను. మా ఫ్రెండ్సందరం కల్సి ఏదో ప్రోగ్రాం వేసుకున్నాం. సాయంత్రానికిగ్గాని ఇంటికి రాను."

ఏవిటో...వీడూ వీడి ఫ్రెండ్సూను.. ఎప్పుడు చూసినా సెలవులొచ్చినా పండగ రోజులొచ్చినా ఇంటి పట్టున అస్సలుండడు.. ఎక్కడ పడి తిరుగుతాడో ఏమిటో...? ఆ మాటంటే మనబ్బాయికేవిటి బంగారం, వాడి మీద మీకే అనుమానాలూ అక్కర్లేదంటూ ఢంకా బజాయించి మరీ చెప్తుంది వర్ధని.. కాదంటే కోపాలు.. అలకలు...

ఎందుకురా ఆ అక్కర్లేని తిరుగుళ్ళు అతిగా తిరుగుతావంటే వాడిక్కోపం.. ఏవిటో ఈ కాలప్పిల్లలు పైకెదుగుతున్నారో తెలియదు పాతాళంలోకి పడిపోతున్నారో తెలియదు...

లేక లేక పెళ్ళయిన పదేళ్ళకి పుట్టాడు పిల్లాడు రమేష్.. ఆ తర్వాత రెండేళ్ళకి పుట్టింది అమ్మాయి... అందుకే పిల్లలిద్దర్నీ అతి గారాబం చేస్తుంది వర్ధని.."

సీరియస్గా ఈ కాలం పిల్లల గురించి ఆలోచిస్తున్నాడు వర్ధని భర్త ముకుందరావు.

కొడుకు బయటికెళ్ళేటప్పుడు పిలిచి మందుల చీటీ ఓ అయిదొందల నోటు చేతిలో పెట్టాడు. "నువ్వు సాయంత్రం వొచ్చేటప్పుడు ఈ మందులు పట్టుకురా... అయిపోయాయి ఈ రోజుతో... తెల్లారి లేస్తూనే కాఫీ కంటే ముందు ఆ మాత్ర వేసుకోవాలి మీ అమ్మ... థైరాయిడ్ ప్రాబ్లమ్ కదా... నేనూ నా బి.పి. మాత్ర పొద్దున్నే మింగాలి. పొద్దున్నే ఆ మాత్రలు పడకపోతే మా పని అంతే సంగతులు... తలా తిరుగుతుంది కళ్ళూ తిరుగుతాయి... మంచం ఎక్కాలి మళ్ళీ..."

"వాడికి తెల్సులెండి... అంత వివరించి చెప్పాలా"

వాళ్ళ మాటలు వాళ్ళకే వొదిలేసి ఎవరో తరుముకొస్తున్నట్టే బయటికి పరిగెత్తాడు రమేష్.

❍ ❍ ❍

సాయంత్రం బయట నిలబడి పక్కింటి సుజాతతో మాట్లాడుతుంటే ఎదురింటి గేటు దగ్గర కనపడిన ఓ అమ్మాయిని చూస్తూనే వర్ధని కనుబొమ్మలు ముడు

## సంధ్యారాగం

దెయ్యాలు వల్లించేది వేదం కాదా?
కాకులు కోకిలని పొడిచినా దాని కంఠం మారదు
తులసివనంలో గంజాయి మత్తు పనిచెయ్యదు
గంజాయివనంలో తులసి అవసరమే
ముఖం కనిపిస్తుందని అద్దాన్ని వేయిముక్కలు చేస్తే
ప్రతి ముక్కలోను ప్రతిబింబం కనిపిస్తుంది
దీపాన్ని ముద్దుపెట్టుకుంటే ఎవరి మూతైనా కాలుతుంది
అగ్ని జ్వాలలో నీళ్ళు చల్లితే నీళ్ళే ఆవిరైపోతాయి
గుండెకాయని కొబ్బరికాయలా తరిగినా
మెదడుని మజ్జిగ కవ్వంతో చిలికినా
కనుగుడ్లతో బిరియాని వండుకున్నా
పొట్టలో పిచ్చి విత్తనాలు చల్లినా
ముఖాన్ని రకరకాల ఆకారాలొచ్చేట్లు ఉలితో చెక్కినా
ముక్కలైన నుదుటిరాతని వెల్డింగ్ చేసి అతికించినా
పాదాల కింద భూమి కదిలిపోయినా నేను నేనే.
నిప్పు మీద మరిగే నీటిని
నీటిలో ఆరుతున్న నిప్పుని
శ్రమజీవుల స్వేదం
సోమరిపోతులకు నైవేద్యం పెట్టనివ్వను
శ్రమైక జీవన సౌందర్యం
ధనవంతుల గోడలకు అలంకారం కానివ్వను
పునాదుల్లేని ఇల్లుంటుందా?
సమాధుల్లేని ఊరుంటుందా?
సమాధుల్లో సంధ్యారాగాన్ని
పునాదుల్లో పూరించిన శంఖాన్ని.

-జి. విజయలక్ష్మి

చుకున్నాయి.

"ఇదుగో అమ్మాయ్! ఓ సారిలా వొస్తావా?"

"ఏంటమ్మగారూ!' వొచ్చిందా పిల్ల.

దగ్గిర్నించి పట్టి పట్టి మరీ చూసిందా పిల్ల తొడుక్కున్న సిల్కు గౌను.

ఔను... సందేహం లేదు... తను బంగారికిచ్చిన గౌనే ఇది..."

"ఈ గౌను..." ఎలా అడగాలో తెలియక నానుస్తుంటే కళ్ళు చక్రాల్లా తిప్పుతూ ఆ పిల్లే అంది.

"మా అమ్మకి బంగారి అమ్మింది..."

"ఓసినీ... పోనీ కదా అని.. పండక్కి... ఉన్న పాత బట్టల్లో కాస్త మంచి సిల్కుగౌను చూసి ఇస్తే తీసుకున్నట్టే తీసుకుని పాత బట్టల బిజినెస్ చేస్తుందా ఇది? ఇంతుందో లేదో దీనికిదేం బుద్ధి? చిన్న పిల్ల అని జాలిపడకూడదు... తెలివి మీరిపోతున్నారు పట్నాల్లో..."

రుసరుసలాడిపోతున్న వర్ధనికి తను కూడా వంత పాడింది సుజాత ఔనంటూ.

"వీళ్ళకి.. ఒకటో తారీకు ఇచ్చే ఆ జీతం తప్ప... మధ్యలో ఎప్పుడూ ఒక్క రూపాయి ఇవ్వకూడదు. పాత బట్టలసలు ఇవ్వకూడదు... ఇలాగే అమ్ముకుంటారు... అదేదో మనమే స్టీల్ సామాన్ల వాళ్ళకిచ్చుకుంటే గిన్నెలు పోగవుతాయి"

"బాగా చెప్పావు... బుద్ధి తక్కువై సిల్కు గౌను ఇచ్చాను... అలా అమ్ముకుంటుందని తెలిస్తే పాత బట్ట లెందుకిస్తాను దానికి... ఇవ్వకపోతే ఇవ్వలేదని ఏడుస్తారు... ఇస్తే ఇదీ వరస..." దండకం చదువుతూనే ఉంది వర్ధని.

❍ ❍ ❍

"రాత్రి నేను నిద్రపోయేదాకా ఇంటికి రానేలేదు రమేష్. ఎన్నింటికొచ్చాడు?" పొద్దున్న లేవగానే అడిగాడు ముకుందరావు అప్పుడే బ్రష్ చేసుకుని మొహం తుడుచుకుంటున్న భార్యని.

"నేనూ నిద్రపోయాను... బాగా ఆలస్యంగా ఒంటి గంటవుతుంటే వొచ్చి తలుపు కొట్టాడు"

"అబ్బా! ఒంటి గంటకా? మనిద్దరివీ మందులు తీసుకొచ్చాడా?"

"ఏమో! అంత రాత్రివేళ అదేం గుర్తుంటుంది నాకు? నేను అడగలేదు, వాడు చెప్పాలేదు."

బంగారి పన్లోకి రావడం చూసి 'అబ్బో! ఈవిడ గారు పన్లోకి దిగడిందే ఇంత పెందరాళే... పండగ అన్నాలవీ బాగా మిగిలుంటాయి పట్టుకుపోదామని వొచ్చుంటుంది ఇంత తొందరగా' అనుకుంటూ వంటింటి వైపు నడిచింది.

"ఇదుగో కాఫీ తాగెయ్యకు... వాడిని లేపి మాత్రలు కొన్నాడేమో అడిగివస్తాను" అంటూ ముకుందరావు కొడుకు పడుకున్న గదివైపు వెళ్ళాడు.

"వొచ్చావా నెరజాణా... ఏదీ మీ అమ్మ? పండక్కి కాస్త పనెక్కువ ఉంటుందని బాగానే ఎగ్గొట్టారుగా ఇద్దరూ కల్సి... ఊళ్ళో పడి హాయిగా తిరిగావా? వాళ్ళిచ్చినవీ వీళ్ళిచ్చినవీ పోగేసి టపాకాయలు బా...గా కాల్చావా?" ఎక సక్కెంగా వరసగా ప్రశ్నల మీద ప్రశ్నలు కురిపించింది వర్ధని.

"నాకు పండగ ఈ రోజే అమ్మగారూ! మొన్న సాయంత్రం నించీ ఒళ్ళు నిప్పులా కాలిపోతూ మా అమ్మ మూసిన కన్ను తెరవలేదమ్మా... ఇందాకనే కళ్ళు తెరిచింది... కళ్ళు తెరుస్తూనే... నిన్న నేను పనికి పోలేదని తెల్సుకుని... ముందు మీ ఇంట్లో పన్చేసి రమ్మని తరిమిందమ్మా... మీరు నా కోసం ఇచ్చిన గౌను, అమ్మకిచ్చిన చీరా మా పక్కింటి యాదమ్మకి అమ్మి ఆ డబ్బుతో డాక్టరమ్మ చెప్పిన మందులు కొన్నానమ్మా అమ్మకోసం... అవి వేశాను కాబట్టే కదమ్మా కళ్ళు తెరిచింది... అమ్మ పేణంతో ఉంటే అంతే చాలు. జొరం తగ్గితే అదే పండగనుకున్నాను... మీరిచ్చిన బట్టలు అమ్మినందుకు కోపం చెయ్యకండమ్మా..."

బంగారి మాటలకి తెల్లబోయి చూస్తోంది వర్ధని.

గట్టిగా పిలుస్తూ హడావిడిగా వంటింటి గుమ్మం దగ్గరకి వొచ్చాడు ముకుందరావు.

"ఏమైంది? అంత హడావిడి పడిపోతున్నారు?"

"ఇంకా ఏమవ్వాలి? నీ సుపుత్రుడు చేసిన పని చూడు... తప్పని సరిగా అమ్మకీ నాకూ ఆ మందులు కావాలిరా తెల్లారి లేస్తూనే అన్చెప్పి అయిదొందలిచ్చానా వాడికి! ఫ్రెండ్సుతో జల్సాగా ఆ డబ్బంతా ఖర్చుపెట్టేసి పైగా ఎదురు ఫ్రెండ్సు దగ్గిర ఇంకా అప్పు పెట్టి వొచ్చాట్ట మహానుభావుడు... నువ్వూ నేనూ ఏమైపోయినా వాడికి పర్వాలేదన్న మాట... వాడి జల్సాలే వాడికి ముఖ్యం..."

ఇంక ఆయన మాటలేవీ వినిపించట్లేదు వర్ధనికి. ఓ పక్క తన కొడుకు... మరో పక్క బంగారి... వాడి కంటే వయసులో చిన్నదైన బంగారి ఎంతో ఎత్తు ఎదిగి పోయినట్టు కనిపిస్తోంది. ■